## క్లుప్తంగా

### మేలుకొలుపుతో ఆధ్యాత్మిక వెలుగులు



కె.వెంకటాపురంలో మేలుకొలుపు చేస్తున్న భక్తులు

కోటవురట్ల : మేలుకొలుపు ప్రతి ఇంటా ఆధ్యాత్మిక వెలుగులు నింపుతుందని విశ్వ హిందూ పరిషత్ ధర్మ ప్రచారక్ గొల్లు చిట్టిబాబు అన్నారు. కె.వెంకటాపురంలో బుధవారం తెల్లవారు జామున మేలుకొలుపు నిర్వహించారు. రామాలయంలో పూజలు చేసి వీధుల్లో నగర సంకీర్తన చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ మేలుకొలుపు ఆధ్యాత్మిక భావనను కలగజేసి సన్మార్గంలో నడిపిస్తుందన్నారు.

### వల్లభ నారాయణస్వామికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి

రాంబిల్లి : దిమిలిలో శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి వార్లను నూతన వస్త్రాలతోనూ, పుష్పాలతోనూ అలంకరించి అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### పథకాల లబ్ధిని వివరించండి



పెట్టు గోళ్లపల్లి సచివాలయంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో తదితరులు

ఎస్.రాయవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాయా లేదా గ్రామ వలంటీర్లు అభిప్రాయ సేకరణ చేయాలని ఎంపీడీవో రామచంద్రరావు అన్నారు. పెట్టుగోళ్లపల్లి సచివాలయంలో బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రంలో ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వానికి ఇప్పుడు వ్యత్యాసం, అందిన పథకాలు వివరిస్తూ లబ్ధిదారుడి అభిప్రాయ వివరాలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు గ్రామంలో ఇంతవరకు అందించిన సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఎంపీడీవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా అర్జున్, వియ్యపు కనకారావు, ఉద్దండం సూర్యనారాయణ పాల్గొన్నారు.

### గణపర్తిలో మేలుకొలుపులు ప్రారంభం



గణపర్తిలో మేలుకొలుపులు

మునగపాక : మండలంలోని గణపర్తిలో బుధవారం తెల్లవారు మేలుకొలుపుల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ధనుర్మాసంలో భాగంగా గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో మేలుకొలుపులు నిర్వహించారు. పురుషులు,మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని గ్రామంలోని పలు దేవాలయాలకు భజనలు చేసుకుంటూ వెళ్లి మేలుకొలుపులు నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మేలుకొలుపుల కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుంది.

### కాల్షియంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ కాల్షియంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు కోరారు. మూలపేట ఎంపీపీ స్కూల్లో బుధవారం విద్యార్థులకు ఫ్లోరోసిస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాల్షియంతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. ఎముకలు, పళ్లు బలంగా ఉండేలా ఆహారం తీసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ యామినీ ప్రియ, ఏఎన్ఎం రమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పేదల వైద్యానికి రూ.25 లక్షలు

- అందరి ఆరోగ్యానికి జగనన్న రక్ష
- ఎమ్మెల్యే బాబూరావు
- లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

నక్కపల్లి : పేదల వైద్యానికి జగనన్న ప్రభుత్వం రూ.25 లక్షలతో భరోసా కల్పిస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం దేవవరంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీకార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2004లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. 2019లో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకానికి పూర్వ వైభవం తీసుకు వచ్చారన్నారు. మొదటి విడతలో దాదాపు 500 రకాల వైద్య పరీక్షలు వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. తర్వాత దశల వారీగా ఈ పథకంలో మరిన్ని వైద్య సేవలు వర్తింపజేస్తూ తాజాగా ఈ పథకం పరిమితి రూ.25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఈ పథకం కింద దాదాపు వెయ్యి రకాల పరీక్షలు, వైద్య సేవలు పొందవచ్చన్నారు. పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైఎస్సార్, జగనన్నలు అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలాది మంది తమ ప్రాణాలను కాపాడుకోగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘవకుమారి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, మాజీ ఎంపీటీసీ నర్సింహమూర్తి, బలరామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దేవవరంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

**పేదలకు వరం..వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం**

మునగపాక : పేదలకు కార్పొరేట్ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం పొందేందుకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. తిమ్మరాజుపేటలో బుధవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యశ్రీ పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తే అదే పథకాన్ని రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. సీఎం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు భరోసాగా నిలుస్తుందన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, మాజీ సర్పంచ్ జగన్నాథరావు, వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ డస్ట్‌బిన్‌లను అందజేశారు.



తిమ్మరాజుపేటలో ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

# సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



లింగాపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: సంక్షేమం అందిందని నమ్మితేనే మాకు ఓటు వెయ్యండని ధైర్యంగా చెబుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో నిర్మించిన నూతన భవనాలను ఎమ్మెల్యే బాబూరావు బుధవారం ప్రారంభించారు. కోటవురట్ల–1 రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, లింగాపురంలో, ఆర్బీకే, సచివాలయ భవనం, కొడవటిపూడిలో ఆర్బీకే, పి.కె.పల్లిలో ఆర్బీకే, సచివాలయ భవనం, వెల్‌నెస్ సెంటర్, బి.కె.పల్లిలో ఆర్బీకే, సచివాలయ భవనం, వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. చిన్నారులకు నాడు–నేడు ద్వారా బంగారు భవిష్యత్‌ను ఇస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు నిర్మించి సమస్త సేవలు ప్రజల చెంతకే చేరుస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేసి ప్రజలను నిలువునా ముంచేసిందన్నారు. మళ్లీ మోసపూరిత హామీలతో వస్తున్నారని, విజ్ఞతతో మెలగాలన్నారు. జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి, కో–ఆప్షన్ మెంబర్ షేక్ ఖుదా భాషా, ఎంపీటీసీ రాంబాబు, సర్పంచ్ గంగారత్నం, పార్టీ నాయకులు సత్యనారాయణ, శ్రీపతిరాజు, రమణ, గోవిందు పాల్గొన్నారు.

**జగన్ పాలన దేశానికే ఆదర్శం**

కోటవురట్ల: ఇంటింటా అద్భుత సంక్షేమం అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కి జగనే కావాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పాములవాకలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం సంక్షేమ ఫ్లెక్సీ, మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కుమారరాజా, సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ పద్మావతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

**సోషల్ మీడియా సభ్యులకు ఐడీ కార్డులు**

ఎస్.రాయవరం: ప్రతిపక్షాల క్షుద్ర విద్యలను తరిమికొట్టేలా సోషల్ మీడియా సభ్యులు పనిచేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గంలో పార్టీ సోషల్ మీడియా సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే ఐడీ కార్డులు అందజేశారు. సోషల్ మీడియా పాయకరావుపేట కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బడుగు వర్గాల ఆశాజ్యోతి జగన్‌మోహన్‌రెడ్డి

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, జగనన్నే అందరి భవిష్యత్ అని రాష్ట్ర ఎస్సీ (మాల) కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముందుగానే పట్టణంలో బుధవారం జన్మదిన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదపాటి అమ్మాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడమే ధ్యేయంగా తండ్రిని మించిన తనయుడుగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలనే ఎన్నికల మేనిఫెస్టోగా ప్రకటించి, అధికారంలోనికి వచ్చిన వెంటనే పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే దీవించి గెలిపించుకోవాలన్నారు. అంతకుముందు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ కార్యక్రమం అమ్మాజీ చేతుల మీదుగా ప్రారంభించారు. వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవవరపు సూర్యచక్రం, మేఘరంజన్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రామకృష్ణ, నాయకులు ధనిశెట్టి బుజ్జి, నెలపర్తి అర్జున్, మధువర్మ, సుధాకర్, సత్తిబాబు, వెంకటసూరి పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ

## పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే


మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) పర్యటించారు. అనారోగ్యాలతో బాధపడుతున్న పార్టీ శ్రేణులను పరామర్శించారు. మూలపేటకు చెందిన సోషల్ మీడియా మండల కన్వీనర్ యల్లపు మురళి అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఆయనను పరామర్శించి రూ.30 వేల మేర సాయం అందజేశారు. మునగపాకకు చెందిన మండల జేసీఎస్ కన్వీనర్ పొలిమేర గణేష్ తండ్రి అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో అతనిని కూడా పరామర్శించారు. నాగులాపల్లికి చెందిన ఇటుకుల రాము రెండు రోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పార్టీ నేతలు బుజ్జి, జానకీరామ్, సింగర్‌రాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కనకలక్ష్మి అప్పారావు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రాము కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

పాయకరావుపేట : ముఖ్యమంత్రి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్పీటీసీ లంక సూరిబాబు అన్నారు. పాల్తేరు గ్రామంలో రెండవ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి రుణ సౌకర్యం కూడా కల్పిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే మనందరం ఎన్నుకోవలసిన అవసరం ఎంతైనా వుందన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో సంక్షేమం, అభివృద్ధికి విడుదల చేసిన రూ.17 కోట్లు వివరాలతో డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూర్యచక్రం, సర్పంచ్ గోసల కృష్ణ, ఈవోఆర్‌డీ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ రామకృష్ణ, హైస్కూల్ కమిటీ చైర్మన్ సత్తిబాబు, వెంకటసూరి పాల్గొన్నారు.



సంక్షేమ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించిన జెడ్పీటీసీ లంక సూరిబాబు

### చిన్నారి వైద్యానికి పలువురి ఆర్థికసాయం

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో అరుదైన వ్యాధితో బాధపడుతున్న రుత్తల ప్రభాకర్ కుమార్తె నాలుగేళ్ల లాస్యశ్రీ చికిత్స నిమిత్తం గ్రామ సర్పంచ్ సిరపరపు శివ రూ.5 వేలు, గ్రామ వలంటీర్లు రూ.5 వేలు, అరబుపాలెం గ్రామానికి చెందిన బొడ్డేడ నాగేశ్వరరావు తదితరులు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి. రవి కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎన్. సత్యారావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

### 23న వినియోగదారులకు అవగాహన సదస్సు

అనకాపల్లి: జాతీయ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా ఈ నెల 23న స్థానిక గౌరీ గ్రంథాలయంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్, మండల కన్స్యూమర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ–కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు సిహెచ్.వి.సూర్యభాస్కరం హాజరవుతారన్నారు.

### ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్లలో ఆరోగ్యశ్రీ కార్డులను ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. రూ.25 లక్షల వరకూ వైద్య సేవలను ఈ కార్డుల ద్వారా పొందవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, నర్మాల కుమార్, కోన లచ్చన్నాయుడు, పిన్నమరాజు వాసు, శివ పాల్గొన్నారు.

## రైతులకు సదుపాయంగా ఆర్‌బీకేలు



రైతు భరోసా నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : రైతులకు అనువైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో రూ.23 లక్షలతో నిర్మాణం చేసిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రయోగాత్మక వ్యవసాయం చేసేందుకు రైతు భరోసా కేంద్రాలు అనుకూలంగా ఉంటాయన్నారు. గత ప్రభుత్వాల్లో రైతులు విత్తనాలు, ఎరువులు తీసుకోవాలంటే కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు నేరుగా గ్రామానికి అన్ని సదుపాయాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు కనకారావు, చొప్పా అర్జున్, శ్రీపతిరాజు, సూర్యనారాయణ, బాబి, వియ్యపు కాసులు, ఎంపీడీవో రామచంద్రమూర్తి, కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు మెగా రక్తదాన శిబిరం

యలమంచిలి : నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా యలమంచిలి పట్టణం గుర్రప్ప కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బోదెపు గోవింద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు ఆధ్వర్యంలో యలమంచిలి పట్టణంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరిట కొన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యేతో పాటు నాలుగు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### వ్యవసాయ కూలీకి గాయాలు

మునగపాక : వాడ్రాపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం విద్యుత్ స్తంభం మీద పడడంతో కూలీకి గాయాలయ్యాయి. అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామానికి చెందిన కూండ్రపు నేస్తాలు వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం వాడ్రాపల్లిలో కోసిన వరి పనలను కుప్పలు వేసే క్రమంలో విద్యుత్ స్తంభానికి చెందిన వైరును తాకాడు. దీంతో అప్పటికే బలహీనంగా ఉన్న స్తంభం అతనిపై పడింది. దీంతో నేస్తాలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అతనిని అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సీఎం జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

ఎస్.రాయవరం : మండలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహ ప్రాగణంలో భారీ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీతో పాటు, పెనుగొల్లు, సర్వసిద్ధి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పళ్లు రొట్టెలు పంపిణీ చేస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. కొరుప్రోలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

### రామచంద్రపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

కోటవురట్ల : రామచంద్రపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఇందులో భాగంగా ఎమ్మెల్యే బాబూరావుతో పాటు పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించనున్నట్టు తెలిపారు.